

రూ.1,11,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి నడింపల్లి సత్యనారాయణరాజు, లీల దంపతులు (హైదరాబాద్) మంగళవారం రూ.1,11,116 విరాళం సమర్పించారు.




ఆలోచనకు అదను.. సృజనకు పదును

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలకు కార్యరూపం ఇచ్చేలా, సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేలా సైన్స్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం వృత్యంతర శిక్షణను ఇస్తోంది.

-8లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు మెగా జాబ్‌మేళా



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక వీఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎంపీ, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టెన్త్ నుంచి పీజీ వరకూ చదివిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మెగా జాబ్‌మేళాకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో సహా దాదాపు 150 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ మేళా ద్వారా 5 వేల మందికి ఉద్యోగాలు వచ్చేలా ఏర్పాట్లు చేశామని, ఏడెనిమిది వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని అంచనా వేస్తున్నామన్నారు. అభ్యర్థులు నేరుగా బుధవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళాకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవచ్చునని ఎంపీ భరత్‌రామ్ తెలిపారు.

టెట్ ప్రారంభం

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ అర్హతకు సంబంధించిన టెట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు వచ్చే నెల 9వ తేదీ వరకూ జరుగుతాయని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. స్థానిక లూథర్‌గిరిలోని రాజీవ్ గాంధీ విద్యాసంస్థల్లోని ఇయాన్ డిజిటల్ జోన్, ఐడీజెడ్ లూథర్‌గిరి పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల హాల్ టికెట్లను తనిఖీ చేశారు. మంచినీటి వసతి, కరెంట్, ఇంటర్‌నెట్ సదుపాయాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకూ మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండో సెషన్‌గా ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. అభ్యర్థులు నిర్దేశిత సమయానికే హాజరు కావాలని స్పష్టం చేశారు. డిపార్ట్‌మెంటల్ అధికారి దిలీప్ కుమార్, రాజమహేంద్రవరం డీవైఈఓ ఈవీబీఎస్ నారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్స్యకారులు పథకాలను వినియోగించుకోవాలి



చేపల తరలింపు వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: మత్స్య సంపద అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. మంగళవారం భట్నవెల్లిలో మంత్రి క్యాంపు కార్యాలయలో 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద చేపల తరలింపు కోసం వినియోగించే శీతలీకరణ ఇన్సులేటెడ్ వాహనాన్ని మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అమలాపురం మండలం కామనగరువులో షెడ్యూల్ కులానికి చెందిన చింతా శ్రీనివాసరావుకు రూ.22.99,252తో ఇన్సులేటెడ్ వాహనం యూనిట్ మంజూరు అయిందని, ఈ వాహనం మంజూరుకు రూ.12 లక్షలు సబ్సిడీగా ప్రభుత్వం అందించిందన్నారు. లబ్ధిదారులు వాటాగా రూ.12,99,252 చెల్లించారని మంత్రి తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, మత్స్య అభివృద్ధి అధికారి అశ్విని సత్య తదితరులు పాల్గొన్నారు.

3న ఉపాధ్యాయులకు పీఏటీ పరీక్ష

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్(పీఏటీ)కు దరఖాస్తు చేసిన జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ మార్చి 3న రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి (డీఎస్ఈఓ) కె.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పరీక్షకు హాజరయ్యే వారు హాల్ టికెట్లను బుధవారం నుంచి www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా పొందాలని సూచించారు.

ఆస్తి పక్కా



రాజమహేంద్రవరం 34వ సచివాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న సిబ్బంది

- పేదల ఇళ్లకు చకచకా రిజిస్ట్రేషన్లు
- ఇప్పటికే 71,174కు పైగా పూర్తి
- సచివాలయాల్లో జోరుగా ప్రక్రియ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పక్కా ఇళ్లపై పేదలకు శాశ్వత హక్కు కల్పిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లాలో జోరుగా సాగుతోంది. ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లోనే లబ్ధిదారుల పేరిట ఇళ్లను రిజిస్ట్రేషన్లు పక్కాగా చేస్తున్నారు. మ్యాపింగ్ పూర్తయిన మేరకు ఇప్పటికే 60 శాతం పైగా రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

శాశ్వత హక్కు కల్పించేలా..

పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీలో భాగంగా గత ప్రభుత్వాలు డి–పట్టాలు మాత్రమే పంపిణీ చేసేవి. అయితే పేదల కలను సాకారం చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు వాటిపై లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. లబ్ధిదారుల పేరిట ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించి వారికి కన్వేయన్స్ డీడ్ అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు ఆ ఇంటిపై సర్వ హక్కులూ సంక్రమిస్తాయి. బ్యాంకులో తనఖా పెట్టి రుణసాయం వంటివి పొందవచ్చు. వారసులకు గిఫ్ట్ డీడ్‌గా బదలాయించే వెసులుబాటు ఉంటుంది.

జిల్లాలో రిజిస్ట్రేషన్ల వివరాలు

మండలం	లబ్ధిదారులు	మ్యాపింగ్ పూర్తి	రిజిస్ట్రేషన్ పూర్తి
రాజమహేంద్రవరం రూరల్	15,004	7,568	7,466
సీతానగరం	4,550	3,069	3,069
రంగంపేట	4,641	4,271	4,257
అనపర్తి	5,409	2,299	2,280
కొవ్వూరు అర్బన్	4,038	3,947	3,946
బిక్కవోలు	3,865	2,534	2,321
రాజమహేంద్రవరం అర్బన్	37,726	10,781	10,410
నిడదవోలు అర్బన్	2,802	2,541	2,420
కొవ్వూరు	3,952	2,822	2,809
దేవరపల్లి	4,206	3,523	3,502
రాజానగరం	11,067	9,991	5,306
గోకవరం	4,621	2,960	2,932
నిడదవోలు	3,404	2,861	2,792
నల్లజర్ల	3,632	2,243	2,202
కోరుకొండ	4,561	3,136	2,708
పెరవలి	3,016	2,622	2,552
ఉండ్రాజవరం	2,634	2,572	2,518
కడియం	3,601	2,651	2,605
గోపాలపురం	2,205	1,290	1,265
చాగల్లు	2,315	2,254	2,238
తాళ్లపూడి	2,356	1,594	1,569

ముమ్మరంగా..

జిల్లావ్యాప్తంగా 1,29,605 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వీటిలో ఇప్పటికే 77,529 స్థలాలకు మ్యాంపింగ్ పూర్తి చేశారు. వీటి రిజిస్ట్రేషన్లు జిల్లాలోని 511 గ్రామ/వార్డు సచివాలయాల్లో జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే 71,174 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో అత్యధికంగా 10,410 రిజిస్ట్రేషన్లు జరిగాయి. అతి తక్కువగా గోపాలపురంలో 1,265 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిని నూరు శాతం పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది.

చాలా ఆనందంగా ఉంది



సొంతిల్లు కట్టుకోవడం అనే కల నెరవేరుతందని ఎన్నడూ అనుకోలేదు. గతంలో సొంతిల్లు లేక ఇబ్బంది పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక మా కల సాకారమైంది. ఇంటిని నా పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

– రాజులపాటి తులసి, బ్రాహ్మణగూడెం

స్థిరాస్తి ఇచ్చారు



జగన్ మా కన్నీళ్లు తుడిచారు. స్థలం ఇచ్చి, ఇల్లు కట్టి ఇచ్చారు. ఈ సంతోషం మాటల్లో చెప్పలేను. ధైర్యంగా, గర్వంగా సొంతింట్లో బతుకుతున్నాం. పుట్టింటి వాళ్లు ఆదరించినట్లు రిజిస్ట్రేషన్ చేయించి మరీ ఇంటిని ఇస్తున్న జగనన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

– గుత్తి జయశ్రీ, రాజమహేంద్రవరం

జగనన్నకు కృతజ్ఞతలు



సీఎం జగన్ నాకు ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా ఇల్లు కూడా నిర్మించారు. ఇప్పుడు ఆ ఇంటిని నా పేరిట రిజిస్ట్రేషన్ చేయడం చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు కృతజ్ఞతలు చెప్పడం తప్ప ఏం చేయగలం.

– కొత్త రమణమ్మ, రాజమహేంద్రవరం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించాలి

- కలెక్టర్ మాధవీలత ఆదేశం
- ఎన్నికల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, నివేదిక అందజేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత ఆదేశించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో తన క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఆమె జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాకు అనుగుణంగా జిల్లాలోని 1,569 పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకణపై కూడా నివేదిక అందజేయాలని ఆదేశించారు. 1,500 మందికి పైబడి ఓటర్లు, నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అందుకు తగిన కారణాలతో ప్రతిపాదనలు పంపాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తి చేయాలన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాలకుగానూ 10 సున్నిత, 50 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నట్టు నివేదిక అందజేశారని, మిగిలిన ఆరు నియోజకవర్గాలపై పంపించాలని సూచించారు. అనపర్తి నియోజకవర్గంలో 228 పోలింగ్ కేంద్రాలకు గాను ఇప్పటి వరకూ 67 సమస్యాత్మకంగా గుర్తించారన్నారు. రాజమహేంద్రవరం సిటీలో 232కు 13 సున్నిత, 36 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 264కు 7 సున్నిత, 15 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారని చెప్పారు. కొవ్వూరులో 176కు 35, నిడదవోలులో 205కు 41, గోపాలపురంలో 248కి 62 చొప్పున సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారని వివరించారు. మరోసారి క్షేత్ర స్థాయిలో పర్యటించి, నిర్ధారణ చేసి, నివేదిక అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గడచిన 45 రోజులుగా 9,789 ఫారం 6, 6ఎ, 7, 8 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, 3,185 పరిష్కరించారని, మిగిలిన 6,604 కూడా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్నందున ఓటర్ల జాబితాకు సంబంధించి వస్తున్న దరఖాస్తులను ఎటువంటి ఫిర్యాదులకూ ఆస్కారం లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ మాధవీలత సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ జి.నరసింహులు, పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్.కృష్ణనాయక్, డిప్యూటీ తహసీల్దార్ సునీల్, జూమ్ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ దినేశ్‌కుమార్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా టెన్త్ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ఈఓ వాసుదేవరావు

రాజమహేంద్రవరం రూరల్: వచ్చే నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై జిల్లాలోని ఎంఈఓ–1లు, 274 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో ఆల్కాట్ గార్డెన్స్‌లోని సత్యసాయి గురుకులంలో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల నిర్వహణ అత్యంత కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్, ఫ్యాన్లు, లైట్లు వంటి సౌకర్యాలు ఉండాలని స్పష్టం చేశారు. తమ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు అందజేసే సూచనలను విధిగా పాటించాలన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, తాడేపల్లిగూడెం డివిజన్ డీవైఈఓ రవీంద్ర భారతి, కొయ్యలగూడెం డివిజన్ డీవైఈఓ రామన్నదొర, డీసీఈబీ సెక్రటరీ అనిత, ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులు, పండితులకు సత్కారం



దేవదాయశాఖ అధికారులు, వేద పండితులను సత్కరిస్తున్న కలెక్టర్ శుక్లా, జేసీ నూపుర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన ఈవోలను, వేద పండితులను కలెక్టర్ హిమాన్షుశుక్లా మంగళవారం సత్కరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వాహక అధికారి పి.తారకేశ్వరరావు, అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వీవీఎస్.సత్యనారాయణ, కోనసీమ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ నాగమల్లేశ్వరరావులను ఆయా ఆలయాల వేద పండితులను కలెక్టర్ సత్కరించారు. అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మంటపాన్ని శాశ్వత ప్రాతిపదికన నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా జేసీ నుపూర్ అజయ్, డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సిలిండర్ అందజేసినప్పుడే ఈ–కేవైసీ

రాజమహేంద్రవరం సిటీ: వంట గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు అందజేసే సమయంలో వారి ఇంటి వద్దనే ఈ–కేవైసీ చేయించాలని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ గ్యాస్ ఏజెన్సీలను ఆదేశించారు. వంట గ్యాస్ సిలిండర్ల విషయంలో వినియోగదారుల భద్రతకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యాన వంట గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యాస్, ఆయిల్ డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీలు సిలిండర్లను డెలివరీ చేయడంలో పోర్టబిలిటీ విధానం అమలు చేయడం ద్వారా వినియోగదార్లకు త్వరితగతిన సేవలు అందించాల్సి ఉందని అన్నారు. ఆ క్రమంలో వినియోగదారులను ఏజెన్సీల వద్దకు రప్పించకుండా వారి ఇంటి వద్దనే డెలివరీ బాయ్ ద్వారా ఈ–కేవైసీ నమోదు చేయాలని స్పష్టం చేశారు. సిలిండర్ డెలివరీకి అదనపు చార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. సిలిండర్ అందజేసేటప్పుడు దాని బరువు, సీల్ నిర్ధారణ, డిజిటల్ విధానంలో చెల్లింపులకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని చెప్పారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. గృహ అవసరాలకు వాడాల్సిన సిలిండర్లు ఇతర అవసరాలకు మళ్లకుండా చూసుకోవాల్సి ఉంటుందని జేసీ తేజ్‌భరత్ అన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పి.విజయభాస్కర్, 26 మంది గ్యాస్, ఆయిల్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రం అగ్రగామి



కొలిమేరులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: గ్రామీణులకు మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం కొలిమేరులో రూ.90 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌లను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉన్న ఊళ్లోనే ప్రభుత్వం సేవలు అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిందని అన్నారు. మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరగనవసరం లేకుండా సచివాలయాల్లోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలూ అందిస్తున్నారని తెలిపారు. ఆయా గ్రామాల్లోనే ప్రభుత్వ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థతో 1.36 లక్షల మందికి ఉద్యోగాలు లభించగా మరో 4 లక్షల మంది వలంటీర్లుగా ఉపాధి పొందుతున్నారన్నారు. ఫలితంగా తలసరి ఆదాయం పెరిగిందన్నారు. ఉచిత విద్య, వైద్య సేవలను రాష్ట్రంలో ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచిందని మంత్రి రాజా తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బొంగు ఉమారావు, డాక్టర్ రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

యాప్‌లో తూనికలు కొలతల పరికరాల రిజిస్ట్రేషన్లు

అమలాపురం రూరల్: వర్తకులు, చిన్నవ్యాపారులు వినియోగిస్తున్న తూనికలు కొలతల పరికరాలను గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు.. వార్డు ఎమినిటీస్ ఆన్‌లైన్ యాప్‌లో రిజిస్టర్ చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తూనికలు కొలతలు పరికరాల రిజిస్ట్రేషన్లు, అమూల్ సంస్థ సహకారంతో చేపట్టనున్న జగనన్న పాల వెల్లువ ప్రారంభోత్సవ కార్యక్రమాల సన్నద్ధత, సూక్ష్మ, చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ తూనికలు కొలతల శాఖలో ఉద్యోగుల సంఖ్య తగ్గిన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గ్రామ వార్డు సచివాలయాలకు అప్పగించామన్నారు. జగనన్న పాలవెల్లువ ద్వారా అమూల్ సంస్థ సహకారంతో మార్చి నెలలో పాల సేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. పాల సేకరణకు గుర్తించిన గ్రామాలలో చేయూత లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. మార్చి 5వ తేదీ నాటికి బల్క్ మిల్క్ కలెక్షన్స్ సెంటర్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా పరిశ్రమల రిజిస్ట్రేషన్ సులభంగా చేయవచ్చునని సూచించారు. జిల్లా తూనికలు కొలతల శాఖ సహాయ కంట్రోలర్ రాజేష్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, సహాయ సంచాలకులు శివరాం ప్రసాద్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతకు అభయం




- నేడు వైఎస్సార్ సున్నా వడ్డీ జమ
- సకాలంలో రుణం చెల్లించిన వారికి మేలు
- 30,714 మంది రైతులకు రూ.5.85 కోట్ల లబ్ధి



రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నదాతకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. అనేక సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాల ద్వారా సాగును సంబరం చేస్తూ, రైతు ఇంట పండగ తీసుకుని వస్తోంది. ఇందులో భాగంగా 2021–22 రబీ, 2022 ఖరీఫ్‌లో రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకుని, సకాలంలో చెల్లించిన రైతులకు డాక్టర్ వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం ప్రభుత్వం లబ్ధి చేకూర్చనుంది. అర్హులైన అన్నదాతల బ్యాంకు ఖాతాలకు సీఎం జగన్ తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సున్నా వడ్డీ సొమ్ము జమ చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా సున్నా వడ్డీ అర్హుల జాబితాను ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల్లో ఉంచామని, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు.

భరోసాకు వేళాయె..

సున్నా వడ్డీతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడో విడత పీఎం కిసాన్ – వైఎస్సార్ రైతు భరోసా పథకం నిధులను కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. తద్వారా సాగు పెట్టుబడులకు రైతులు ఎటువంటి ఇబ్బందులూ పడకుండా తోడ్పాటునందిస్తున్నారు. ఈ వ్యవసాయ సీజన్‌లో తొలి విడతగా గత ఏడాది జూన్ 1న వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.5,500, పీఎం కిసాన్ కింద రూ.2 వేల చొప్పున జిల్లాలోని 1,35,867 మంది రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం రూ.102 కోట్లు అందజేసింది. రెండో విడతగా గత ఏడాది నవంబర్ 7న 1,41,096 మంది రైతులు, కౌలు రైతులకు రైతుభరోసా కింద రూ.2 వేలు, పీఎం కిసాన్ కింద రూ.2 వేలు చొప్పున రూ.58.55 కోట్లు పంపిణీ చేశారు. మూడో విడతగా నేడు జిల్లాలోని 1,41,216 మందికి రూ.28.39 కోట్లు జమ చేయనున్నారు.



జిల్లాలోని రైతులకు లబ్ధి చేకూరనుందిలా..

సీజన్	రైతులు	లబ్ధి (రూ.లు)
2021–22 రబీ	17,409	3,40,09,000
2022 ఖరీఫ్	13,305	2,45,61,000
మొత్తం	30,714	5,85,70,000

నియోజకవర్గాలు వారీ వివరాలు

నియోజకవర్గం	రైతులు	లబ్ధి (రూ.లక్షలు)
అనపర్తి	4,431	74.723
రాజమహేంద్రవరం రూరల్	858	14.075
రాజమహేంద్రవరం సిటీ	1	0.030
రాజానగరం	6,361	115.753
గోపాలపురం	4,535	108.048
జగ్గంపేట (గోకవరం)	921	15.881
కొవ్వూరు	6,462	135.368
నిడదవోలు	7,145	121.823

రైతు పక్షపాత ప్రభుత్వం



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం దండగ అనే పరిస్థితి. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయాన్ని నేడు ఒక పండగగా మార్చారు. దుక్కు నుంచి పంట అమ్ముకునే వరకూ రైతుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇచ్చిన మాటను తు.చ. తప్పకుండా సీఎం జగన్ సున్నా వడ్డీ సొమ్మును మా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండటం సంతోషంగా ఉంది.

– మిరియం నెహ్రూ, రైతు, తొర్రేడు

క్లుప్తంగా

గోదావరి లంకలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుర్తు పట్టడానికి వీలుల్లేకుండా పాడైన వైనం

కొవ్వూరు: ఔరంగబాద్ ఎదురుగా గోదావరి నది మధ్యలో ఉన్న గోంగూరలంక దిబ్బ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం పట్టణ పోలీసులు గుర్తించారు. స్థానికుల ద్వారా తెలిసిన సమాచారం మేరకు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు పడవ సాయంతో సిబ్బందిని వెంట బెట్టుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుళ్లిపోయి ఉన్న అస్థిపంజరాన్ని గుర్తించారు. సుమారు పదిహేను రోజులకు పైగా నదిలో కొట్టుకుని వచ్చి ఒడ్డుకు చేరినట్లు సీఐ చెబుతున్నారు. మృతదేహం గుర్తుపట్టడానికి వీలు లేనంతగా కుళ్లిపోయి ఉంది. మృతునికి సుమారు యాభై ఏళ్ల పైబడి వయస్సు ఉండవచ్చునని భావిస్తున్నారు. జేబులో లభ్యమైన సెల్‌ఫోన్, చేతి వాచి లభ్యమైనట్లు తెలిపారు. మృతదేహం వద్ద లభ్యమైన సెల్‌ఫోన్ బ్యాటరీ పూర్తిగా ఉబ్బి పోయి ఉంది. సిమ్ ఆధారంగా వివరాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నామని ఆయన తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు. ఏఎస్సై జీజీ ప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ బాబురావు, ఇతర సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లిన వారిలో ఉన్నారు.

పిఠాపురంలో భారీ చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం పోలీసులు

పిఠాపురం: తలుపులకు తాళాలు వేసుకుని పెళ్లికి వెళ్లిన ఒక ఇంట్లో భారీ చోరీ జరిగినట్లు పిఠాపురం పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. పట్టణంలోని రజకపేటకు చెందిన వాడపల్లి హేమలత తన కుమారుడు పెళ్లికోసం కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 21వ తేదీన రాజమహేంద్రవరం వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి వంటగది తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా తలుపులు తెరిచి ఉండి, చెల్లాచెదురుగా పడి ఉండడంతో కుటుంబ సభ్యులు చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలో ఉన్న 25 కాసుల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల నదు చోరీకి గురైనట్లు తెలిపారు. హేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాకినాడ నుంచి వచ్చిన క్లూస్‌టీం పోలీసులు వేలిముద్రలు సేకరిస్తున్నట్టు తెలిపారు.

ఆలోచనకు అదను.. సృజనకు పదును

- విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతున్న ప్రభుత్వం
- టీచర్లకు శిక్షణ, ల్యాబ్‌ల నిర్మాణానికి నిధులు
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



జిల్లా విద్య, వైజ్ఞానిక ప్రదర్శన (ఫైల్)

రాయవరం: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలకు కార్యరూపం ఇచ్చేలా, వారిలో సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేలా సైన్స్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం వృత్యంతర శిక్షణను ఇస్తోంది. సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటుకు కృషి చేస్తోంది. భారత శాస్త్రవేత్త సీవీ రామన్ ఎఫెక్ట్‌ను ప్రకటించిన రోజు ఫిబ్రవరి 28న ఏటా జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకునేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్న విధానంపై ప్రత్యేక కథనం..

ప్రతి పాఠశాల ప్రయోగశాలే

'డిజైన్ థింకింగ్' పేరుతో నేటి యువతరం నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తోంది. పుస్తకాలతో కుస్తీ పడుతూ..మార్కుల వేటలో బిజీగా ఉంటూనే.. విద్యార్థులు పరిశోధనలకు ప్రాణం పోస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలతో ప్రతి పాఠశాల ఒక ప్రయోగశాలగా మారుతోందనడంలో సందేహం లేదు. జిల్లాలో 45 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. 2019 నుంచి అటల్ ఇన్నోవేషన్ మిషన్‌లో భాగంగా వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను రూ.12 లక్షలతో ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా 20వేల పాఠశాలలు అటల్ మారథాన్ పోటీల్లో పాల్గొనగా తొలి 50 స్థానాల్లో రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నిలిచింది. ఐ.పోలవరం మండలం జి.వేమవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఈ ఘనతను సాధించింది.

పాఠశాల స్థాయి నుంచే పోటీలు

గతంలో ఎన్నడూ లేని విధంగా గతేడాది విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను పాఠశాల స్థాయి నుంచే ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సైన్స్ కిట్స్‌ను అందజేయనుంది. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అగస్త్య ఫౌండేషన్ ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 300 మందికి శిక్షణనిచ్చింది. గణితం, పీఎస్, బయాలజీ ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికి నాలుగు రోజుల వంతున శిక్షణ ఇవ్వడమే కాకుండా సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులకు కిట్లు అందజేశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్, సైన్స్ ల్యాబ్స్, సైన్స్ సెమినార్లు, సైన్స్ డ్రామాల నిర్వహణకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక సైన్స్ అధికారిని నియమించింది. వారి ఆధ్వర్యంలోనే ఏటా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు, ఇన్‌స్పైర్, చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆయా జిల్లాల పరిధిలో సైన్స్ సెమినార్స్ నిర్వహించారు.

సామాజిక సమస్యలకు పరిష్కారం చూపేదే సైన్స్



సమాజంలో నిత్యం ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాలను చూపేదే సైన్స్. శాస్త్రీయ దృక్పథాలను పెంపొందించడం, ప్రజలకు మెరుగైన జీవనాన్ని అందించడం సైన్స్ ఉద్దేశం. సైన్స్‌తోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుంది.

– జీవీఎస్ఎస్ నెహ్రూ, జిల్లా సైన్స్ అధికారి, రాజమహేంద్రవరం

డిజిటల్ తరగతుల ద్వారా ఈజీగా పాఠాలు

ఈ ఏడాది పాఠశాల విద్యలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్యను ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఇందుకు ప్రతి ఉపాధ్యాయుడికి మూడు రోజుల వంతున శిక్షణ ఇచ్చారు. కోనసీమ జిల్లాలో 142 పాఠశాలల్లో 945 ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా సైన్స్ పాఠాలను సులభంగా విద్యార్థులకు అందిస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో నిర్వహించని విధంగా ఐఎఫ్‌పీల ద్వారా సైన్స్ ప్రయోగాలను విద్యార్థులకు మరింత సులభంగా, వారి కళ్లకు కట్టేటట్లుగా చూపించేందుకు సిమ్యులేషన్ విధానంలో ప్రాక్టికల్స్ నిర్వహించడాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రతి జిల్లా నుంచి గణితం, పీఎస్, బయాలజీ సబ్జెక్టుకు 20 మంది వంతున డీఆర్పీలుగా ఎంపిక చేసి శిక్షణనిచ్చారు. సీఆర్పీలుగా శిక్షణ పొందినవారు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. ఈ విధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,547 మంది గణితం, 1,073 మంది ఫిజికల్ సైన్స్, 1,109 మంది బయలాజికల్ సైన్స్ టీచర్లకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతిని నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 30 పాఠశాలల్లో కెమిస్ట్రీ ల్యాబ్స్ నిర్మాణం చేపడుతున్నారు. ఒక్కో ల్యాబ్‌కు రూ.15.58 లక్షల వంతున రూ.4.67కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలో ఉన్న 21 పీఎంశ్రీ పాఠశాలల పరిధిలో ఎనిమిది పాఠశాలల్లో కెమిస్ట్రీ ల్యాబ్‌ల నిర్మాణం చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నవీన్ మృతదేహం

కొవ్వూరు: దొమ్మేరు సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిడిపి వార్డుకి చెందిన యువకుడు కొడమంచిలి నవీన్(26) దుర్మరణం పాలయ్యాడు. దొమ్మేరు సమీపంలో మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నవీన్ తలకు బలమైన గాయం కావడంతో 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పట్టణ పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నవీన్ బందపురంలోని ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నట్లు చెబుతున్నారు. డ్యూటీకి ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై వెళుతుండగా దొమ్మేరు శివారున ఎన్‌సీఎల్ ఫ్యాక్టరీ సమీపంలో ఎదురుగా వచ్చే మరో మోటారు సైకిల్ ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఎదురుగా ఢీకొట్టిన మోటారు సైకిల్ వ్యక్తి కూడా గాయాలపాలైనట్లు చెబుతున్నారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మృతుడు అవివాహితుడని తెలిపారు.

అన్యథా భావించవద్దు

- ఆ మాటను వెనక్కి తీసుకుంటున్నా
- రాజకీయ లబ్ధి కోసమే వివాదం సృష్టి
- కాకినాడ సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: మత్స్యకారుల మనోభావాలు గాయపడి ఉంటే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కుటుంబాన్ని విమర్శించే క్రమంలో 'జాతి' అని పొరపాటున నోరుజారి వ్యాఖ్యానించా... ఆ వెంటనే 19వ తేదీన పాత్రికేయుల సమావేశంలో జరిగిన పొరపాటును స్పష్టంగా వివరించానని పేర్కొన్నారు. అయితే దీనిని అవకాశంగా తీసుకుని ఎన్నికలు సమీపిస్తున్నందున రాజకీయ లబ్ధికోసం కొంతమంది ఈ అంశాన్ని వివాదాస్పదం చేస్తున్నారంటూ చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. తన వ్యాఖ్యలపై మత్స్యకారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నందున ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నానని, అన్యథా భావించవద్దని ఎమ్మెల్యే కోరారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో కొనసాగుతున్న తాను అన్ని కులాలు, మతాలు, వర్గాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు. ప్రధానంగా గతంలో ఏ ప్రజాప్రతినిధి చేయనంతగా మత్స్యకారుల నివాసిత ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సంక్షేమం చేపట్టానన్నారు. రాజకీయంగా కూడా మత్స్యకారులు ఉన్నత స్థానంలో ఉండాలని ఆశించానని, ఆ క్రమంలోనే ఎమ్మెల్సీ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, డిప్యూటీ మేయర్ వంటి పదవులను కూడా మత్స్యకారులకు దక్కేలా ప్రయత్నించానన్నారు. గర్వించదగ్గ విద్యాదాత, మత్స్యకార వర్గానికి చెందిన మల్లాడి సత్యలింగనాయకర్ జయంతి, వర్ధంతులను కూడా అధికారికంగా నిర్వహించేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేయడంతోపాటు మరెన్నో కార్యక్రమాలు చేపట్టానన్నారు. అదే సమయంలో కాకినాడలోని మత్స్యకార వర్గాలు కూడా తన నాయకత్వాన్ని బలపరిచి ఆదరిస్తున్నాయని స్పష్టం చేశారు. అటువంటప్పుడు మత్స్యకార జాతిని కించపరిచేలా తానెందుకు వ్యాఖ్యానిస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రశ్నించారు. ఏది ఏమైనా మత్స్యకారులు తన వ్యాఖ్యల పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నందున వెనక్కి తీసుకుంటున్నానని స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, మత్స్యకార ప్రతినిధులు కాటాడి జానికిరామ్, చక్రవర్తి, సంగాని నందం, వాసుపల్లి కృష్ణ, చవ్వాకుల రాంబాబు, పేర్ల జోగారావు, భీమరాజు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల దర్శనానికి ఆర్టీసీ బస్సు

తుని: మహాశివరాత్రి సందర్భంగా వివిధ పుణ్య క్షేత్రాలను దర్శించేందుకు ఆర్టీసీ బస్సు నడుపుతున్నట్లు స్థానిక డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మార్చి 5న బస్సు తునిలో బయలుదేరి పూరి, కోణార్క్, సాక్షిగోపాలం, భువనేశ్వర్, జాజ్‌పూర్, గయ, బుద్ధగయ, శిరోగయ మీదుగా మహాశివరాత్రి రోజున కాశీ చేరుకుంటుందన్నారు. అక్కడ మూడు రోజుల బస అనంతరం త్రివేణి సంగమం, సీతామడి, ప్రయాగ, అయోధ్య, నైమిశారణ్యం దర్శనం ఉంటుందన్నారు. భక్తులకు ఉదయం, సాయంత్రం టీ, టిఫిన్, మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. టికెట్టు ధర రూ.12,500 గా నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 73829 13216, 73306 51904 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సామగ్రి కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు



శిక్షణ సందర్భంగా మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: పంచాయతీలకు సంబంధించిన సామగ్రి కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఈటీసీలో కోనసీమ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించారు. కోనసీమకు చెందిన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు అమలాపురంలో శిక్షణ నిర్వహించవలసి ఉందని, కొన్ని కారణాల వల్ల సామర్లకోటలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఐఎస్ఐ మార్కుతో వస్తువులు మార్కెట్‌లోకి వస్తాయని, వాటిని పరిశీలించి కొనుగోలు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలు కొనుగోలు చేసే వస్తువులు కూడా మార్కెట్‌లో నాణ్యతతో ఉండే విధంగా చూడవలసిన బాధ్యత పాలక మండలి, పంచాయతీ కార్యదర్శిపై ఉంటుందన్నారు. దీనికి సంబంధించి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన పెంచుకొనే విధంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. వినియోగదారుల హక్కులను కాపాడడానికి ఈ శిక్షణ దోహదపడుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ నాలుగు రోజుల పాటు 800 మందికి శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈటీసీ మేనేజరు పి.శ్రీనివాసు, ఫ్యాకల్టీలు బి.వెంకటేశ్వరరావు, భీమేశ్వరి, ఎం. చక్రపాణిరావు, ఎస్కే మోహిద్దీన్, సాయికృష్ణ శిక్షణ నిర్వహించారు.

ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల ఏర్పాటు



ఎస్కే ఖాదర్ బాషా

ఆలమూరు: మద్యం అక్రమ రవాణా నిర్మూలనకు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్కే ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఆలమూరులోని ఎస్ఈబీ కార్యాలయానికి వచ్చిన ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రపాలితమైన యానాం నుంచి ఎక్కువగా మద్యం అక్రమ రవాణా జరుగుతోందని, నివారణ చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్ఈబీ, పోలీసు, కమర్షియల్ ట్యాక్స్, అటవీశాఖ అధికారులతో కూడిన బృందం ఎదుర్లంక వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టు వద్ద రోజుకు మూడు షిఫ్టులలో తనిఖీలు నిర్వహిస్తోందన్నారు. యానాం-ఆలమూరు రోడ్డులో మద్యం అక్రమ రవాణా జరుగుతోందని గుర్తించామన్నారు. ఇప్పటికే కాకినాడ జిల్లాకు చెందిన ఎస్ఈబీ శాఖ అరటికాయల లంక, సుంకరపాలెంలో ఎస్ఈబీ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయగా కోనసీమ జిల్లా ఎస్ఈబీ శాఖ బ్రహ్మపురి, బాలాంత్రంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిందన్నారు. ఎస్ఈబీ అధికారులతో ప్రత్యేక మొబైల్ టీమ్‌ను ఏర్పాటు చేసి వివిధ రహదారుల్లో మద్యం అక్రమ రవాణా జరగకుండా తనిఖీలను చేపడుతున్నామన్నారు. మూడు మద్యం కేసులు మించితే సాంఘిక బహిష్కరణ, ఐదు మద్యం కేసులు నమోదైతే పీడీ యాక్టును అమలు చేయడంతో అక్రమ మద్యం కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం

ఏఎస్పీ ఖాదర్‌భాషా సమక్షంలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ మద్యాన్ని స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో ధ్వంసం చేశారు. ఆరు నెలల కాలంలో 47 కేసులలో పట్టుబడ్డ 583.9 లీటర్ల సారాను పారబోశారు. సుంకం చెల్లించని 477 బాటిళ్లు, డీపీఎల్ కేసులకు సంబంధించి ఆరు బాటిళ్లను ధ్వంసం చేశారు. ఏఈఎస్ జి.అమర్‌బాబా, ఎస్ఈబీ సీఐ ఏఎం ఖాదిర్ పాల్గొన్నారు.

ఎస్సైకి దిగువ కోర్టు విధించిన శిక్ష ఖరారు

వరకట్నం వేధింపుల కేసులో తీర్పునిచ్చిన మేజిస్ట్రేట్

రాజమహేంద్రవరం రూరల్: వరకట్నం వేధింపుల కేసులో శిక్ష పడిన ఎస్ఐ మల్లులు సతీష్‌కుమార్, అతని తల్లి మల్లుల విజయ శారద లకు దిగువ కోర్టు విధించిన శిక్షను ఖరారు చేస్తూ రాజమహేంద్రవరం పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2014లో రాజమహేంద్రవరానికి చెందిన శిరీషను హైదరాబాద్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న మల్లుల సతీష్ కుమార్ వివాహం చేసుకున్నాడు. రూ.17 లక్షల కట్నం ఇచ్చి శిరీష తల్లిదండ్రులు ఘనంగా వివాహం జరిపించారు. వివాహమైన కొద్ది రోజులకే నాలుగు అంతస్తుల బిల్డింగ్, డాబా ఇంటిని అమ్మి అదనంగా రూ.కోటి కట్నం తీసుకురమ్మని, రూ.25 లక్షలతో వాహనం కొని ఇవ్వాలని ఎస్సై సతీష్‌కుమార్ డిమాండ్ చేశాడు. అతనితో పాటుగా అతని కుటుంబ సభ్యులు మానసికంగా, శారీరకంగా వేధించమే కాకుండా అడిగినట్టుగా ఇవ్వకపోతే విడాకులు ఇమ్మని, తెల్ల కాగితాలపై, స్టాంప్ పేపర్‌పై సంతకాలు చేయమని వేధించారు. సతీష్‌కుమార్ తన సర్వీస్ రివాల్వర్‌తో బెదిరించి శిరీష వద్ద ఉన్న 35 కాసుల బంగారం తీసుకొని ఆమెను ఇంటి నుంచి గెంటి వేశాడు. రాజమహేంద్రవరం వచ్చిన సతీష్ కుమార్, అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం డిమాండ్ చేయడమే కాకుండా శిరీష తల్లిదండ్రులపై దౌర్జన్యం చేశారు. బాధితురాలు రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కోర్టులో సాక్షులను విచారించిన అనంతరం సతీష్‌కుమార్‌కు ఐదేళ్ల జైలు శిక్ష , రూ.17 లక్షల జరిమానా, భార్యను వేధించినందుకు మూడేళ్ల జైలు శిక్ష విధించారు. అత్తగారైన విజయశారదకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.21,000 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ఐదవ అదనపు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఆనాటి న్యాయమూర్తి సీహెచ్‌వీ రామకృష్ణ 2018 ఆగస్టులో తీర్పు నిచ్చారు. దీంతో హైదరాబాద్‌లోని పోలీసు ఉన్నతాధికారులు ఎస్సై ఉద్యోగం నుంచి సతీష్‌కుమార్‌ను తొలగించారు. వారు తమకు పడిన శిక్షలపై రాజమహేంద్రవరం పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీల్ చేసుకున్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు మంగళవారం కింద కోర్టులో ఇచ్చిన తీర్పును ఖరారు చేశారు. ఇప్పటికే జిల్లా కోర్టులోనూ, మనోవర్తి కేసులోనూ సతీష్‌కుమార్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. సీనియర్ న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరత్నం బాబు బాధితురాలి తరపున వాదనలు వినిపించారు.

రూ.20 కోట్లతో కన్వర్టబుల్ స్టేడియం

- స్మార్ట్‌సిటీ సీఈవో, ఎండీ వెంకటరావు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కన్నబాబు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న స్మార్ట్‌సిటీ సీఈవో, ఎండీ వెంకటరావు

కాకినాడ: రూ.20 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో కాకినాడ సురేష్‌నగర్‌లో వైఎస్సార్ కన్వర్టబుల్ ఇండోర్ స్టేడియం నిర్మించినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్, స్మార్ట్‌సిటీ సీఈవో, ఎండీ జె.వెంకటరావు తెలిపారు. ఈ కన్వర్టబుల్ స్టేడియంను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు ప్రారంభిస్తారన్నారు. స్టేడియం ప్రారంభ ఏర్పాట్లను స్మార్ట్‌సిటీ సీఈవో, ఎండీ వెంకటరావు మంగళవారం సాయంత్రం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, జూడో, కబడ్డీ, ఖో-ఖో, టెన్నిస్, టైక్వాండో, వాలీబాల్, రెజ్లింగ్ వంటి ఇండోర్ క్రీడా పోటీలకు అనువుగా ఈ స్టేడియంను నిర్మించామన్నారు. ఇక్కడ సుమారు 1,200 సీట్ల సామర్థ్యంతో ఆయా క్రీడాపోటీలను వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. స్టేడియంలో టేబుల్ టెన్నిస్, ఇతర బోర్డు గేమ్స్ ఆడేందుకు ప్రత్యేక హాల్ కూడా నిర్మించామన్నారు. పురుషులు, మహిళా క్రీడాకారుల కోసం డ్రెస్ ఛేంజింగ్ రూమ్స్, లాకర్స్, ఫస్ట్ ఎయిడ్‌రూమ్, వీడియోకాన్ఫరెన్స్ రూమ్, టాయ్‌లెట్స్ వంటి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీతోపాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని చెప్పారు.

వసతిగృహ విద్యార్థినికి అస్వస్థత

సమాచారం ఇవ్వలేదని తల్లిదండ్రుల ఆగ్రహం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వసతి గృహ విద్యార్థిని భాను



పాఠశాలలో ఆందోళన నిర్వహిస్తున్న తల్లిదండ్రులు, స్థానికులు

గోకవరం: వసతి గృహంలో తమ కుమార్తె అనారోగ్యానికి గురైనా తమకు సమాచారం అందించలేదని, దీనివలన తమ కుమార్తె ఆరోగ్యం క్షీణించిందని ఆరోపిస్తూ వసతి గృహం వద్ద తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. మండలంలోని వీరలంకపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల వసతి గృహంలో ఆరవ తరగతి చదువుతున్న సుంకర భాను కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినికి గోకవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అయితే ఈ విషయం తమకు తెలియపర్చలేదని తల్లిదండ్రులు స్థానికులతో కలిసి మంగళవారం ఆందోళన చేపట్టారు. తమ కుమార్తె అనారోగ్యానికి గురైందని తమకు తెలిసిన తరువాత ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లి పరీక్షలు చేయిస్తే ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయని తెలిపారని, దీనికి ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. దీనిపై ప్రిన్సిపాల్ ఎం.వి.రాణి మాట్లాడుతూ విద్యార్థిని అస్వస్థతకు గురైనప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామన్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థినిని ఇంటికి పంపించకూడదన్నారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని అప్పటి వరకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించామన్నారు. మెరుగైన వైద్య సేవల నిమిత్తం విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లామన్నారు.

ఆయిల్, ఐరన్ చోరీపై కేసు నమోదు

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని తమ్మయ్యపేట వద్ద అక్రమంగా లారీల నుంచి ఐరన్, ఆయిల్ చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై వినయ్‌ప్రతాప్ మంగళవారం తెలిపారు. తమ్మయ్యపేటలో ఆయిల్ చోరీ జరుగుతున్నట్టు సమాచారం అందడంతో కాకినాడ క్రైమ్ పోలీసులతో కలిసి స్థానిక పోలీసులు దాడి చేశారు. 100 కిలోల ఐరన్, 200 లీటర్ల డీజిల్‌ను నిల్వ ఉంచగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు.